

# అసలు కారణం

భూపాల్

**పాండు రంగారెడ్డి, మోహన్‌రెడ్డి ఆఫీసులో ఇద్దరూ కలిసి పనిచేసుకుంటున్నారు. పావు ఎకరం స్థలం, పంజగుట్ట ప్రాంతం. ఆఫీసు మేడ చుట్టూ లాన్ వుంది. తోటమాలి వీరయ్య. ఓ ప్యూన్‌బాయ్ అరవిందు, మేనేజర్ రమేష్ ఉంటారు.**

ఆఫీసు ఓనర్స్ ఇద్దరున్నా, ఒక్కరున్నా రోజూ టీకోసం తీసుకునే పాలు సాయంత్రం ఆరు వరకైనా పగిలిపోవు- పాడుకావు. రంగారెడ్డి, మోహన్‌రెడ్డి ఇద్దరు రాకుంటే నాలుగు గంటలకే పాలు పగిలిపోయి గడ్డకట్టి వుంటాయి. అనుకోని పనుల ఒత్తిడివల్ల బయట తిరిగి ఏ ఒక్కరు సాయంత్రంవేళ నాలుగు దాటి వచ్చినా పాలు పగిలే వుంటాయి. ఇదంతా ఆశ్చర్యంగా వుంది మేనేజర్ రమేష్‌కి. ఇలా రెండు నెలలుగా జరుగుతుంటే ఆఫీసు బాయ్ అరవిందుని పిలిచి "పాత్రలు సరిగా కడిగించడంలేదా లేక విజయా డైరీ వాళ్లదే పొరపాటా, వేడి తగిలి పగిలిపోతున్నాయా?" అంటూ అడిగాడు. తనకేం తెలియదన్నాడు బాయ్ అరవింద్.

ఎంత తరచి చూసినా ఈ పాల పరివర్తన ఒక వింతగా వుంది. రూపాంతర క్రమం విచిత్రంగా వుంది. నాలుగు తర్వాత ఎప్పుడొచ్చినా ఈ మధ్య 'టీ' దొరక కుండేమని రంగారెడ్డి కేకలు. వర్షంలో తడిసివచ్చినా 'టీ' బయట బగ్గీ నుండి తెస్తున్నాడుగానీ, ఆఫీసులో శుభ్రంగా కాచి ఇవ్వరేం! సార్లు ఇక రారని మీరే కాచుకు తాగేస్తున్నారా? ఆరువరకు చూస్తే ఏం? కావాలంటే మరో లీటర్ వేయించుకోండి. మోహన్‌రెడ్డికి 'టీ' అంటే ఎంత ఇష్టమో మీకు తెలియదా? అంటూ మేనేజర్‌ని గట్టిగా మందలించాడు.

"మీరు నాలుగు దాటినాక వస్తే ఇంతేసార్. అవి పగిలి వుంటాయి. మీరు మూడున్నరకి రండి రాత్రి తొమ్మిది వరకుండండి 'టీ' దొరుకుతుంది. పాలు పగిలిపోవు" అన్నాడు రమేష్. రంగారెడ్డికి కోపం వచ్చింది. "మా రాకకు, మీ పాలు విరగడానికి సంబంధమేముందయ్యా? పిచ్చి పిచ్చిగా మాట్లాడకు... నేను ఆలస్యంగావస్తే అలిగి విరిగిపోవడానికి అవి నా పెండ్లామేమిటయ్యా? నీ వెర్రిగానీ" అన్నాడు.

అదీ నిజమేననిపించింది రమేష్‌కి. ఇంటి దగ్గర తనకు పాలుపోసే యాదయ్యకు ఈ విషయం చెప్పి చూశాడు. అతను 'అలా జరగదనీ, తను ఎక్కడా వినలేదనీ' చెప్పాడు. రమేష్ తనకు కాబోయే భార్యతో ప్రస్తుతం ప్రియురాలితో కథగా చెప్పాడు. ఆమె ఏదో మీ ఆఫీసులో మహత్యముందని భయంతో కళ్లు పెద్దవి చేసింది.

తోటమాలి వీరయ్య నడిగితే "ఊర్కోండి సార్..." అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఇక పాల డైరీ వాళ్లని సంప్రదించక తప్పదనుకున్నాడు రమేష్. ఇలా మూడు నెలలు గడిచాయి. వర్షాకాలం వెళ్లిపోయింది.

ఒకరోజు ఉదయం పదిగంటల నుండి సాయంత్రం నాలుగుగంటల వరకు పాల గిన్నెమీద అరవింద్‌కి, వీరయ్యకి తెలియకుండా చాటుగా నిఘా వుంచాడు. ఆఫీసు ఊడ్చే పనిమనిషి చిన్నకొడుకును గూడా! వాడు ఆడుతూపాడుతూ నల్లిలాగా గమనించసాగాడు. ఆరోజు పెద్ద సార్లిద్దరూ రాలేదు. మూడుయాభై ప్రాంతంలో పనిమనిషి కొడుకు పరిగెత్తుకొచ్చి 'సార్ సార్' అని పిలిచాడు. "ఏమంట్రే?" చెప్పాడు. "వీరయ్య పాలలో ఉప్పు" అని...

అంతే ఇదా సంగతని వీరయ్యని పిలిచి చితకకొట్టేంత కోపంతో అడిగాడు రమేష్ ఎందుకని. "సార్! నేనూ మీతో సమానంగా పనిచేస్తానా? మరైతే వీడు అరవిందు నాకు ఓ కప్పు టీ పోయడండీ. సార్లు రాకపోతే వాడే పాలు మరగకాచి నిండుగా తాగేస్తాడండీ. ఒకసారి అడిగితే... నన్ను బయటకు నెట్టేశాడండీ అందుకే..."

"ఛీ. నీ పాడుబుద్ధి పాడుగానూ! నీకు దొరకని దాన్ని ధ్వంసం చేస్తాననడం ఎంత నీచం. ఎంత పిల్ల మనస్తత్వం. నేచెపుతాగానీ ఇలాంటి పాడు పనులు మళ్ళీ చేయకు" అన్నాడు రమేష్.

# స్వగతం

## మా నాన్నగారు ఎందరికో ప్రాణదానం చేశారు




లక్ష్మణ్

**మా** నాన్నగారు జీవితాంతం వనమూలికలతో ఆయుర్వేద వైద్యం చేస్తూ ఎన్నో భయంకర వ్యాధుల్ని నయం చేసి ఎందరికో ప్రాణదానం చేశారు. అరణ్య ప్రాంతాల్లో సేకరించిన వనమూలికలతో ఔషధాల తయారీని అక్కడి వారికి చూపిస్తూ ఎప్పుడూ కొండకోన ప్రాంతాల్లో సంచరించేవారు. ప్రాచీన ఆయుర్వేద గ్రంథాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి అద్భుత ఔషధాలెన్నో తయారుచేసేవారు. ఆయన పుట్టింది వైద్యసేవచేయడానికే అన్నట్టుండేది. ఒక్కపైసా కూడా తీసుకునేవారు కాదు. దాంతో మేం దుర్భరదారిద్ర్యంతో జీవితాన్ని సాగించాం. యాభైఏళ్ళ సుదీర్ఘ వైద్య ప్రస్థానంలో ఆయన ఎన్నో బాధలు భరించారు. మేం జీవితంలో నిలదొక్కుకోడానికి చాలా కష్టపడాల్సివచ్చింది. హైదరాబాద్‌లో వున్న నేను మా నాన్నగారితో వైద్యశాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఆలోచనతో మా వూరు చేరాను. మా నాన్నగారితో అరణ్యాం తిరిగి అరుదైన అతివిలువ గల మూలికల్ని పరిశోధించాను. వందలాంది ఔషధాలు ప్రస్తుతం సిద్ధంగా ఉన్నాయి. వేలకు వేలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేని పేదరోగులకు అతి స్వల్పవ్యయానికి వైద్యం చేయాలనేదే మా నాన్నగారి ధ్యేయం. నాన్నగారు పోతూ పోతూ 'నాయనా.. ఏనాడు వైద్యాన్ని స్వార్థానికి వాడుకోకు, వ్యాపారంగా భావించకు..' అని చెప్పారు. ఆయన లక్ష్యసాధన దిశగానే ప్రస్తుతం మా వైద్యశాల నడుస్తోంది.

- సింహాచలం లక్ష్మణ్, గొల్లపల్లి, కరీంనగర్ జిల్లా

## సంఘసేవే ప్రధానం

**నే**ను డిగ్రీ వరకు చదివాను. ప్రస్తుతం సూర్యలక్ష్మి కాటన్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్నాను. చిన్ననాటినుంచి సంఘసేవ చెయ్యాలని, కొంతమంది పేదవారికైనా సహాయపడాలని అనుకుంటూ ఉండేవాణ్ణి. ఎటువంటి చెడు అలవాట్లులేని నేను నా సంపాదనలో కొంతమేర పేదలకు వెచ్చిస్తుంటాను. మా వూరి పాఠశాలలో ఏడవ, పదవ తరగతి చదివే పేద విద్యార్థులకు పరీక్ష ఫీజులతో పాటు చదువుకోవడానికి కావాల్సిన మెటీరియల్‌ను కూడా సమకూర్చుతుంటాను. నాకున్న సంఘసేవా దృక్పథానికి నా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, మిత్రులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.




సంజీవరావు

- డి. సంజీవరావు, మహబూబ్‌నగర్ జిల్లా

## అర్థంచేసుకున్న స్నేహితుడు

**నే**ను కడపలోని మున్సిపల్ హైస్కూల్‌లో మూడవ తరగతి చదువుతున్న రోజులు. అప్పుడు జరిగిన సంఘటనను ఎప్పటికీ మరచిపోలేకపోతున్నాను. మా ఇల్లు స్కూల్‌కి చాలాదూరంగా ఉండేది. రోజూ నడిచి వెళ్ళి వస్తూ ఉండేవాణ్ణి. ఒకరోజు అనుకోకుండా నేను కాలుజారి బురదలో పడిపోయాను. అందువలన నా చేయి విరిగింది. రెండురోజుల్లో నాకు కట్టు కట్టించారు. దాంతో ఏపని చేయాలన్నా చాలా ఇబ్బందిగా ఉండేది. ఆగస్టు పదిహేనవ తేదీన మా స్కూల్లో ఆటల పోటీలు నిర్వహించేవారు. దానిలో పాల్గొనాలనే ఆశ ఎంతగానో ఉండేది. కానీ పాల్గొనడానికి నా పరిస్థితిని చూసి ఇంట్లో వాళ్ళు డబ్బులు ఇవ్వలేదు. అందుకు నేను బాధపడుతుంటే నా స్నేహితుడు నా బాధ అర్థం చేసుకొని నాకు తెలియకుండా ఆటలకు పేర్లు ఇచ్చి డబ్బు కూడా ఇచ్చాడు. ఆ విషయం తరువాత నాకు చెప్పాడు. ఇంట్లోవాళ్ళకి బయపడి చెప్పలేదు. ఆ పరిస్థితుల్లో నేను ఆడగల ఆటలను ఆడి వాటిలో రెండవ, మూడవ బహుమతులను గెలుచుకున్నాను. వాటిని మా ఫ్రెండ్ చేతులమీదుగానే అందుకున్నాను. అప్పటినుంచి మేమిద్దరం మంచి స్నేహితులగా మిగిలిపోయాం. ఆపదలో ఆదుకున్న వాడే నిజమైన మిత్రుడని నేనెప్పటికీ అనుకుంటుంటాను.



మహేశ్వరరెడ్డి

- కల్లూరి మహేశ్వరరెడ్డి, నాగార్జునకాలేజి, ఒంగోలు